



వైజ్ఞానిక కథ

# రేపు

వి.వి.బి.రామారావు

**విరించి** తల తిప్పి చూస్తే పక్కన శిల్ప లేదు.

నడిబజారు. వచ్చే వాళ్ళూ, వెళ్ళే వాళ్ళూ ఇసక వేస్తే రోడ్డు మీద రాలడం లేదు.

"ఇవాళ అలా తిరిగి వద్దాం, పదండి!" అంది శిల్ప తను ఆఫీసు నుంచి రాగానే. తనేమో ఆఫీసుకు సెలవు పెట్టేసింది.

కొన్ని రోజులుగా శిల్ప ఆందోళన పడుతున్నట్టు తను గమనించక పోలేదు.

కాని తనేం చెయ్యగలడు!

నిబంధనల్నీ, శాసనాలనీ అతిక్రమించడం అంత తేలిక కాదు—అందునా తనకు! తన చరిత్రే అంత!

కాని...కాని మనుషుల మౌలికమైన ఆశల్ని మట్టు పెట్టే విధానాలను రూపొందించే ప్రభుత్వమూ ఒక ప్రభుత్వమే!

శిల్ప తనకు ఆలోచనలు లేవనుకుంటూంది—మమతలు తెలియవనుకుంటూంది.

ఒక్కోసారి తన మీద తనకే అసహ్యం కలుగుతూంది. తన మీద లేబరేటరీలో ఉద్యోగులందరికీ ఒక ప్రత్యేకమైన గౌరవం ఉంది. తనెవరు? తను చేస్తున్న దేమిటి? తను చెయ్యాల్సిందేమిటి?

తనని కనీసం ఎవరూ అనుమానించరు. నమ్మక ద్రోహం చేస్తున్నాడు తాను. కాని అది ఆత్మ ద్రోహం కాదు. మమతకు దోహదం చేసే క్రియ.

ఆ రోజు ఆ షరతుల జాబితా కింద పత్రం మీద సంతకం చేస్తున్నప్పుడు కాలే కడుపు కంటే మరే కష్టాన్నయినా ధైర్యంగా ఎదుర్కో వచ్చుననుకున్నాడు.

శిల్పకూడా ఆ షరతులను ఆ రోజు ఆమోదించక పోయినట్టయితే ఉద్యోగం కోసం కాదు—ప్రాణం కోసమయినా ఆ పని చేసి ఉండేవాడు కాదు.

చుట్టూ జన సందోహం. రోడ్డు తిరునాళ్ళలాగా ఉంది. శిల్పను వెదకడం ఎలా?

సుంచుని చుట్టూ చూపులు సారిస్తున్నాడు.

"పిల్లల్ని కనడం నేరం!"

నియాన్ అక్షరాలు జిగ్గున మెరిసి పోతున్నాయి.

అల్లాంటి సూచనలూ, సందేశాలూ, శాసనాలూ రోజూ కొన్ని వందలసార్లు చూస్తున్నవే. అన్నీ తనకు తన కేమిటి అందరికీ కంఠోపాఠమే!

"దేశ సౌభాగ్య పరిరక్షణ పిల్లలు కనడం కంటె ఆనందదాయకం."

"అవసరం లేని బిడ్డ దేశానికి ముప్పు!"

"మాతృత్వం కోరుకుంటున్నారా? మీ దగ్గరే ఉన్న జనాభా విస్తరణాధికారిని కలవండి!"

ఎందుకో మొదటిసారిగా అతి వికృతంగా, అశ్లీలంగా కనపడింది ఆ సూచన.

శిల్ప! శిల్ప ఏదీ?

పది గజాల దూరంలో మైమరిచి పోయి అద్దాల బీరువా ముందు నుంచుండి పోయింది శిల్ప.

తల పైకెత్తి చూశాడు విరించి.

"బిడ్డను కనడం కంటె కొనడం తేలిక!"

అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. గతం గజిబిజిగా కళ్ళ ముందు అలుక్కు పోయింది.

జెనెటిక్ ఇంజనీరింగ్‌లో తను డాక్టరేట్ చేస్తున్నాడు.

తన తల్లి ఎవరో, తండ్రి ఎవరో తనకు తెలియదు. అతనికి జ్ఞానం తెలిసిన దగ్గర నుంచీ ప్రభుత్వ సంస్థలలోనే ఉంటున్నాడు. విద్యా సంస్థలలో చదువు. దాని అనుబంధ హాస్టల్‌లో ఉనికి.

చదువై పోయింది.

ఇక అక్కడ ఎక్కడా ఉండడానికి వీల్లేదు. పరీక్ష లైపోగానే ఆదో లెంగ. ఎమ్. ఎస్‌సి. అయి పోయింది. తన సమస్యను అర్థం చేసుకున్న సొంత బిడ్డలున్న ఒక తండ్రి తనకు రీసెర్చిలో సీటూ దానితో పాటు స్కాలర్‌షిప్పూ ఇచ్చాడు. ఇంట్రా జనరిక్ హైబ్రిడైజేషన్ (అంతర్‌జన్య సంకరం) చేసి పప్పు దినుసులలో కంది, కాయధాన్యాలలో గోధుమలను సంకరం చేసి కొత్త వంగడం రూపొందించినందుకు ఆవంటి విశ్వవిద్యాలయం అతనికి డాక్టరేట్ ఇచ్చింది.

కాని థీసిస్ పరిశీలనకు పంపిన ఉత్తర క్షణంలో తన స్కాలర్‌షిప్ అయిపోయింది. హాస్టల్ గదీ ఖాళీ చెయ్యాల్సి వచ్చింది.

అడపా తడపా దాచుకున్న డబ్బు చేతిలో ఒక మూడొందల రూపాయలు ఉంది.

బస్ స్టాప్ దగ్గర తారసిల్లింది శిల్ప.

తన డిపార్ట్‌మెంట్‌లోనే ఎమ్. ఎస్‌సి. చేస్తూందట. తనకి పరిచయమే లేదు. తనేమో తన గొడవేమో. తనని గురించి విద్యార్థినులు మాటాడుకుంటున్న విషయమే విరించికి తెలియదు.

శిల్ప నాటకీయంగా ప్రారంభించింది: "మా నాన్నగారు నా చిన్నతనంలోనే పోయారు. సంతానం పెర్మిట్ సంపాదించిన సంతోషం ఆయన ఎన్నాళ్ళో అనుభవించ లేదు."

"సారీ!"

"మా అమ్మ ఉంది."

"అదృష్టవంతులు. నేను ప్రభుత్వ బిడ్డని. నా తల్లి ఎవరో. తండ్రి ఎవరో ప్రభుత్వ శాస్త్రీయ విభాగం ఫైళ్ళలో ఎక్కడో ఉందేమో! మనుషుల

అదే జనాభా కావాలనుకుంది కాబట్టే గవర్నమెంటు నాకు జన్మ నిచ్చింది.''

''తెలుసు! మీ స్కాలర్‌షిప్ అయిపోయింది. మీరు ఇక పబ్లిక్ మనిషే. అంటే గవర్నమెంటు బిడ్డ కాదు. మీ పోషణ భారం మీదే. మీ సమస్య నాకు తెలుసు. మీలాంటి ప్రైవేటు మనుషులుగా ఉనికిని సాధించుకోలేని పదిమంది యువకులు మా వీధిలోనే ఉన్నారు. అసలు ఉద్యోగా లేవీ? నేను ఒక నిశ్చయానికి వచ్చాను. మీకు ఆశ్చర్యం కలిగించ వచ్చు. ఆరు నెలల నుండి మీ పరిశోధన తీరును నేను గమనిస్తున్నాను. నాకు వీలైనంత. అమ్మ ఒప్పుకుంది. నాకు ప్రయివేటు ఇల్లుంది. మీరు మాతోపాటు ఉండండి.''

విరించి శిల్ప ఇంటికి అలా వెళ్ళాడు.

ఇద్దరూ ఉద్యోగాలకు అప్లై చేశారు. జన్యు శాస్త్రం చదివిన మూలాన ఇద్దరికీ ఒకే శాఖలో ప్రభుత్వం ఉద్యోగా లిచ్చింది.

శిల్పకు షరతుల జాబితా కింద పత్రం మీద సంతకం చెయ్యడం ఇష్టంలేదు. 'ఉద్యోగం లేకపోతే నేం?'' అంది.

కాని గవర్నమెంటుబిడ్డ విరించి ఉద్యోగం చెయ్యక పోవడమంటే ప్రభుత్వంతో సహకరించక పోవడమే నని అది దేశ ద్రోహంతో సమానమనీ భావిస్తాడు.

తాను పత్రం సంతకం చేసి ఉద్యోగానికి వెళతా నన్నాడు. శిల్ప తెల్లబోయింది.

'ఇంత జెనెటిక్ ఇంజనీరింగ్ తెలిసిన మనిషికీ ప్రేమించిన మగువ మనసు తెలియదా' అనుకుంది.

''అయితే నన్ను వదిలి వెళ్ళిపోతారా?''

''ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చిన తరవాత.'' నసిగాడు

''మీతో నేను కలకాలం ఉంటానంటే...''

''నాతోనా?'' అతనికి ఆశ్చర్యం ఆగలేదు.

''ఏం? మీతో ఎందుకు ఉండకూడదు?''

''నేను అమ్మా. నాన్నా తెలియని మనిషిని. మీరు కోరుకుంటే ప్రయివేటు మనుషులు''

''అంటే గవర్నమెంటు బిడ్డలకి మనసు లుండవా?''

వాదన కొంత జరిగిన తరవాత శిల్ప పెళ్ళికి ఒప్పించింది విరించిని. ఉద్యోగం చెయ్యడానికి విరించి శిల్పని ఒప్పించాడు. అంటే పత్రం మీద సంతకానికి కూడా సన్నమాట.

పత్రంలో విరివిగా ఉన్న ప్రభుత్వోద్యోగుల నిబంధనల సారాంశం ఇది:


ఉద్యోగంలోకి వచ్చిన వాళ్ళు ఎవరూ పెళ్ళి చేసుకోకూడదు. ఉద్యోగంలో చేరే ముందు పెళ్ళి చేసుకున్న వాళ్ళయితే ఇద్దరూ వెంటనే సంతాన నిరోధక వ్యాక్సీన్‌ను పుచ్చుకోవాలి. ఒక్కసారే కాదు. ప్రతిసంవత్సరం. జీవితాంతం సొంతబిడ్డనికనకుండా ఉంటామనివిడివిడిగా లిఖితంగా మేజిస్ట్రేటు ముందు పత్రాన్ని సంతకం చేస్తూ ప్రభుత్వ దేముళ్ళందరి ముందూ ప్రమాణం చెయ్యాలి.

ఆనావ్యాక్సీన్ తీసుకోడానికి అభ్యంతరంతెలియ చేయకూడదు. భార్యా భర్తలలో ఏ ఒక్కరు ప్రభుత్వోద్యోగి అయినా వారి వైవాహిక భాగస్వామి చేతకూడానిర్ణీతమైన ప్రమాణాలు చేయించి పత్రం మీద సంతకం చేయించాలి.

ఈ నిబంధనల నతిక్రమించి గర్భం ధరించడం జరిగితే భార్యా భర్తల ఇద్దరి ఉద్యోగాలూ పోతాయి వారికి రావలసిన పెన్షన్ వగైరా సదుపాయాలన్నీ ఉపసంహరింప బడతాయి. ఇదికాక వారిపై సివిల్ క్రిమినల్ చర్యలన్నీ తీసుకొనబడతాయి. ముందస్తుగా తనకు తెలియకుండానే భార్య గర్భంలో పెరుగుతున్న పిండాన్ని భర్త తను తెలుసుకోగానే దగ్గరున్న ఆస్పత్రిలో విచ్ఛిన్నం చేయించ వలసి ఉంటుంది. ఏ మాత్రం అనుమానం కలిగినా భార్యా భర్త లిద్దరి రేషనుకార్డులూ తక్షణం ఉపసంహరించుకోబడ తాయి

శిల్ప ఎక్కడ మాయమైంది?

విరించి దేశప్రగతిని చూసి ఎంతో సంతోషిస్తు న్నాడు. గత అయిదేళ్ళలో ప్రయోగశాలలో తప్ప ఏ స్త్రీకూడా ప్రసవించ లేదని వార్త. అంతేకాదు. అది గూఢచారి సంస్థల భోగట్టాకూడా!




చటుక్కున విరించి మనసులో వూహ మెరిసింది. పది గజాలువెనక్కి వెళ్ళాడు. అక్కడ అద్దాల వెనక ఉన్న బిడ్డ వంక మైమరిచి చూస్తూంది శిల్ప.

''బిడ్డను కనడం కంటె కొనడం తేలిక!'' నియాన్ అక్షరాలు మిలమిల లాడుతున్నాయి. చంటి పాప నవ్వులా జిగ్గున మెరుస్తున్నాయి.

విరించికి గుండె లోపల ముల్లుతో కెలికన ట్టయింది.

''ఏమండీ, నాకు బిడ్డ కావాలి!''

''కావేద్దాం! కాని చెక్కుబుక్కు...''

అతని వంక జాలిగా చూసింది శిల్ప. అతన్ని చెయ్యి పట్టుకుని గబగబా పది గజాలు ముందుకు తీసుకుపోయింది.

''టాక్సీ! టాక్సీ!''

ఆ గొంతులో ఏదో ఆవేదన— అత్యవసరస్థితి.

టాక్సీబిల్ ఇచ్చేసి పరుగు పరుగున విరించి మేడమీదికి వచ్చాడు.

మంచం మీద పడుకుని శిల్ప వెక్కి వెక్కి ఏడుస్తూంది.

''ఇప్పుడే నేను ఆ బిడ్డను తీసుకొస్తా. షాపు మూసేసినా, నర్సరీ నుంచి తీసుకోవచ్చు!'' కంగారుగా అన్నాడు విరించి.

''మీకు నే నెలా చెప్పాలండీ!''

''అంటే?''

''ఎవరి గర్భంలోనో పెరిగిన బిడ్డ నా కక్కర లేదు. నా గర్భంలో... నా బిడ్డ... మీ బిడ్డ... మన బిడ్డ...''

''ఆవేశ పడుతున్నావ్! మరి మనం సంతకం చేసిన పత్రాలు..''

''ఐ డోన్ట్ కేర్!''

''మనం వ్యాక్సీన్ తీసుకున్నాంగా!''

శిల్ప లేచి కూచుంది. ''కింద వాళ్ళ కుక్క పిల్లల్ని పెట్టింది— జ్ఞాపకం ఉందా? ఆ రోజు మనం పార్టీకికూడా వెళ్ళాం.''

''నువ్వు చెప్పేది నాకు తెలియడం లేదు.''

''గత రెండు సంవత్సరాలుగా కింద వాళ్ళ కుక్క మీద ప్రయోగాలు చేస్తున్నాను-- నెల నెలా దానికి వ్యాక్సీన్ ఇస్తూ వచ్చాను. మొన్న సీజన్‌లో కూడా... దానికి విరుగుడుగా వో యాంటీడోట్ ఇచ్చాను. నా ప్రయోగం ఫలించింది. అదే వ్యాక్సీన్ నేనూ తీసు కున్నాను. నిద్రలో మీకు స్పర్శ తెలియకుండా, కాలు దగ్గర నొప్పి తెలియకుండా చేసి ఫెమోరల్ వెయిన్ లోంచి యాంటీడోట్ ఎక్కించాను. పాత కాలం వాళ్ళ భాషలో చెప్పాలంటే నా కిప్పుడు మూడో నెల!''

''వాట్!'' సోఫాలో నుంచి విరించి లేచి నుంచు న్నాడు.

''కాని, మన బతుకులు...'' ఇంకా ఏదో అన బోయాడు.

''ఐ డోన్ట్ కేర్! మీరు సంతోషిస్తారను కున్నాను.'' శిల్ప లేచి అద్దం ముందు నుంచుంది.

''శిల్పా! ఎంత పని చేశావ్! దీనివల్ల ఎలాంటి పరిణామాలు ఉంటాయో వూహించావా? నువ్వు

ఆ కుక్కతో ఆడుకుంటున్న దగ్గర నుంచి నాకు కాస్త అనుమానంగానే ఉంది. కాని నాతో చెప్పకుండా ఏ పనీ చెయ్యవని నీ మీద నమ్మకంతో ఊరుకున్నాను. నువ్వు ఇంజక్షన్ ఇచ్చావంటే నాకు జ్ఞాపకం వస్తోంది. ఆ రోజు...ఆ రోజు... మనం... ఏదో ఆవేశం... ఏదో అనుభూతి. బట్ మై డియర్ శిల్పా! నీకు తెలుసు నేను ప్రభుత్వ బిడ్డనని. నువ్వు నాతో ఒక్క మాట చెప్పి ఉంటే నేను ఎలాగో ఒక బిడ్డకి పెర్మిట్ తెచ్చేవాడినేమో! ఇప్పుడు మనం శాసనాన్ని ఉల్లంఘించాం. ఇక మనకి ఒకటే మార్గం."

విరించి టెలిఫోన్ దగ్గరకు వెళ్ళాడు.

"ఛీ! మీరేం మగాళ్ళు! భార్య నీళ్ళోసుకుంటే సంతోషించని భర్త ఎక్కడైనా ఉంటాడా! అందునా ఈ రోజుల్లో...నే నెంత తెగువ చేశాను! ఎంత అద్భుతమైన పరిశోధన చేశాను! నన్ను అభినందిస్తారనుకున్నాను— ఎగిరి గంతేస్తారనుకున్నాను— కౌగిలించుకుని. నౌ ఐ డోన్ట్ కేర్! ఈ బిడ్డ మన బిడ్డ. అది చాలు. మీ కోపతాపాలతో కాని, వచ్చే పరిణామాలతో కాని నాకు సంబంధం లేదు. ఇప్పటికే గత కొద్ది సంవత్సరాలుగా ప్రకృతి సిద్ధంగా పిల్ల లెవరూ పుట్టలేదు. మార్పుకి నేను నాంది పలుకుతున్నాను. మీరు సంతోషించనందుకు స్త్రీగా నా మనసు బాధ పడుతూంది. ఇప్పుడు ఆనందించ లేదు కాబట్టి పుట్టబోయే నా బిడ్డ మీద మీకు ఎలాంటి హక్కూ ఉండదు. ఈ క్షణం నుంచీ మనం ఇద్దరం కేవలం ఒక సంస్థలో ఉద్యోగం చేస్తున్న సహోద్యోగులం మాత్రమే. దిస్ ఈజ్ ఫైనల్!"

విరించి ఈ కోపం చూసి బెంబేలు పడిపోలేదు. నెత్తిన చెయ్యి పెట్టుకుని కూలబడి పోలేదు.

వెంటనే ఫోన్ దగ్గరకు వెళ్ళి హెడ్‌క్వార్టర్స్ ఆసుపత్రికీ, అతి దగ్గరగా ఉన్న పోలీస్ స్టేషన్‌కీ ఫోన్ చేశాడు.

శిల్ప ఏ మాత్రం తొణకకుండా అంబులెన్స్ రాగానే కిందకు వెళ్ళి అందులో కూచుంది. వెనక పోలీసు జీపులో కూచున్నాడు విరించి.

శిల్పను నేరుగా ఒక ప్రత్యేకమైన గదిలోకి తీసుకెళ్ళారు.

బయట కుర్చీలో విరించి కూచున్నాడు. పోలీసులు అతని దగ్గర స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఆ గదిలో ఎవరున్నారో విరించికి తెలియదు.


పోలీసులు వెళ్ళిపోయి అరగంట అయింది.

గదిలో నుంచి ఎవరూ బయటకు రాలేదు. ఆ గదిలో నుంచి బయటకు మరో దోవ ఉందా?

తనతో కొన్ని సంవత్సరాలుగా సాహచర్యం చేస్తున్న భార్య...తనంటే అమితమైన అనురాగం..

గర్భ విచ్ఛిత్తి చెయ్యడం ఇంకా పూర్తి కాలేదా? నిరసంగా—మతి లేకుండా ఉన్న శిల్పకు తనూ చేయూత నివ్వాలి. మామూలు మనిషిగా చెయ్యాలి. ఉద్యోగం పోయినా సరే శిక్షను గురించి...

విరించి తల నిండా ఏవేవో ఆలోచనలు. తన కళ్ళ ముందే ఎవరెవరో గదిలోకి వెళుతున్నారు. వెళ్ళిన వాళ్ళు బయటకు రావడం లేదు.



కొంప తీసి గర్భవిచ్ఛిత్తి చెయ్యడంలో అవకతవక ఏమైనా జరిగిపోయిందా?

లేక ఇల్లాంటి పని మరెవరూ చెయ్యకుండా శిల్పకు ఘోరమైన—అనూహ్యమైన—వికృతమైన శిక్షను ప్రభుత్వం అక్కడి కక్కడే వేసి అమలు చేసేస్తూందా?

ఒక అరగంటయ్యాక ఒక డాక్టర్ బయటకు వచ్చి తనను మరొక గదిలోకి తీసుకువెళ్ళాడు.

అతని ముఖం వంక చూడడానికి విరించికి భయం వేసింది. తనవీ...

"కంగ్రాట్స్, డాక్టర్ విరించీ! మమ్మల్నందరినీ కంగారు పెట్టేశారు మీ భార్య. ఆమె...ఆమెకు... ఆమె గర్భవతి కాదు. మెనోపాస్. అంతే. ఇంక ఆవిడకు నెల నెలా బుతుస్రావం కాదు. మీరు ఆమెను ఇంటికి తీసుకెళ్ళవచ్చు. ఆవిడ సైకిక్‌గా షాక్ పొందినట్టుంది. ఏదో లెక్చరిస్తుంటే మేమంతా చేసేది లేక వింటున్నాం. గుడ్‌నైట్!"

"థాంక్యూ. డాక్టర్! థాంక్స్ వెరీ మచ్!"

విరించి నేరుగా ఆ గదిలోకి వెళ్ళిపోయాడు.

శిల్ప ముఖం ఎర్రగా కందిపోయి ఉంది. ఆ గదిలో ఇంకెవరూ లేరు. అటు పక్క నుంచి మరో యువతి ఉంది.

"డియర్!" మంచం మీద కూర్చున్నాడు విరించి. ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. "ఇది విచారించాల్సిన సమయం కాదు. మన పరువు నిలబడింది. మనం నేరం చెయ్యలేదు. గడిచినది పీడ కలగా మరిచిపోదాం. పద ఇంటికి."

"డాక్టర్ విరించీ! నేను తొందర పడ్డానని మీ ఉద్దేశం కదూ. తొందరపడింది మీ శాస్త్రజ్ఞులు, మీ పరిశోధకులు. ఇంతమంది డాక్టర్లు... ఇంతమందికీ నెత్తి నోరూ కొట్టుకు చెప్పాను— హిస్టీరియా అనీ, సైకోసిస్ అనీ భృకుటి ముడుస్తున్నారే కానీ అస లేమయిందో... కాదు, ఏమవబోతూందో తెలుసా? ఇక దేశంలో బిడ్డ పుట్టడం అసంభవం...కొన్ని సంవత్సరాలు... వరసగా వ్యాక్సీన్ పుచ్చుకుంటే స్త్రీ శాశ్వతంగా గొడ్రాలై పోతుంది. దానికి నిదర్శనం కావలసిన వయసు రాకుండానే బుతుస్రావం ఆగిపోవడం. పురుషుల లోనూ ఇలాంటి వైపరీత్యం ఏర్పడే ఉంటుంది. నేను నిజమైన దేశభక్తురాలిని. నేను చెప్పింది నిజమని తెలుసుకోవడానికి, రుజువు దొరకడానికి మీరు ఇప్పటికి తయారుచేసిన ప్రయోగశాలలోని పిండాన్ని నా గర్భస్థం చెయ్యండి. అయినా ఆ పిండం పెరగదు. దానికి కావలసిన శక్తి నాలో నశించి పోయింది. నా లోనే కాదు, ఏ స్త్రీలోనైనా సరే నశించి పోయే ఉండాలి. అంటే ఇక జనాభా తరగవలసినదే కాని, మరో బిడ్డ మళ్ళీ—ఏ విధాన్నయినా సరే—పుట్టే అవకాశం లేదు. ఈ తరం భూమిమీద చివరి తరం."

"శిల్పా! శిల్పా! నాకు పుట్టనంత మాత్రాన ఎవరికీ—ఏ పద్ధతిలోనైనా సరే—ఇక బిడ్డలు పుట్టరనుకోవడం నీ భ్రాంతి కాదూ?"

"పక్క గదిలో డాక్టర్లు ఒకరితో ఒకరు సంప్రదించుకుంటున్నారు. దేశమంతటకీ ఫోన్‌కాల్స్ చేస్తున్నారు. వాళ్ళను పిలవండి!" శిల్ప కేక పెట్టింది.

బిలబిలా డాక్టర్లందరూ ఆ గదిలోకి వచ్చారు.

"నా సిద్ధాంతం ప్రకారం మన దేశంలో స్త్రీలందరూ ఒక నెల రోజుల లోపల బుతుక్రమ కాలం దాటిపోతారు—వాళ్ళ వయసుతో సంబంధం లేకుండా. అంటే కృత్రిమ గర్భాలనికూడా వాళ్ళు ధరించలేరు. దేశభక్తి ఉంది కాబట్టి ఈ మాట చెప్పాను. వెంటనే నేను కనిపెట్టిన యాంటిడోట్ విరివిగా వాడితే..."

డాక్టర్లందరూ ఒకరి ముఖా లొకరు చూసుకోవడం గమనించాడు డాక్టర్ విరించి.

"షి ఈజ్ రైట్, సర్! మేం కనుక్కున్నాం. ఇంకా కనుక్కుంటున్నాం. గత పదిహేను రోజుల నుంచీ గర్భవతులమయ్యామన్న భ్రాంతిలో భయంతో ఆస్పత్రులకు వచ్చిన స్త్రీల సంఖ్య కోటిన్నర. అయితే అందరిలోనూ ఒకటే సామాన్య లక్షణం. గర్భధారణ కాదు. మెనోపాజ్! శిల్ప వచ్చేవరకూ అంత మందీ కలిసి ఈ ఆలోచన చెయ్యలేదు. ఈ ఆలోచన ఎవరికీ రాలేదు."

మరుసటి రోజు సాయంకాలం అయ్యేసరికి రాజధానిలోని ప్రకటనలన్నీ కొత్త రంగులు పూసుకున్నాయి.

"మరో బిడ్డకు ఇదొక్కటే అవకాశం. ఆలస్యం చేస్తే అసాధ్యమే!"

"స్తన్య మివ్వడం స్త్రీ జాతి భాగ్యం. ఆ భాగ్యాన్ని వెంటనే పొందండి."

"గర్భం ధరించండి! బహుమతిని గ్రహించండి!"

"గర్భ నిరోధక వ్యాక్సీన్‌కి విరుగుడు కావలసిన వాళ్ళు పేర్లు నమోదు చేయించుకో నవసరం లేదు. మీ దగ్గరే ఉన్న ఆస్పత్రిలో..."

ఏమి టేమిటో బోర్డులు...

ఎనిమిది వేల మంది బోర్డులు రాస్తూనే ఉన్నారు.